## క్లుప్తంగా

### 20న శాకంబరిగా శ్యామలాంబ దర్శనం


శ్యామలాంబ అమ్మవారు

సామర్లకోట: మండలంలోని గొంచాల, అచ్చంపేట, పనసపాడు గ్రామస్తుల గ్రామ దేవతగా ప్రసిద్ధి చెందిన శ్యామలాంబ అమ్మవారిని ఈ నెల 20న శాకంబరిగా అలంకరిస్తామని ఆలయ ధర్మకర్త ముమ్మిడి వెంకటేశ్వర రావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఆషాఢ మాసం, దశమి రోజున ప్రతి ఏడాది అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరణ చేస్తామన్నారు. ఈ మేరకు అలంకరణకు కూరగాయలు, పండ్లు ఇచ్చేవారు తమ పేర్లను ఆలయ కమిటీ వద్ద నమోదు చేయించుకొని శనివారం ఉదయం వాటిని ఇవ్వాలన్నారు. ఆదివారం ఉదయం శాకంబరిగా శ్యామలాంబ దేవి దర్శనమిస్తారని తెలిపారు.

### రైల్వే సరిహద్దుల్లో గడ్డికి వేలం

సామర్లకోట: రైల్వే శాఖ పరిధిలో సహజ సిద్ధంగా పెరిగిన గడ్డిని కోసుక్లేందుకు ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని పీడబ్ల్యూఐ కార్యాలయం సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామ సుబ్బారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కడియం-కేశవరం, కేశవరం–ద్వారపూడి, ద్వారపూడి యార్డ్, అనపర్తి–బిక్కవోలు, బిక్కవోలు–పీబీ దేవం, పీబీ దేవం–జి.మేడపాడు, జి.మేడపాడు–సామర్లకోట స్టేషన్ల మధ్య ఉన్న రైల్వే సరిహద్దుల్లో గడ్డికి వేలం వేస్తున్నామన్నారు. రైల్వే అధికారులు ఆయా యార్డుల్లో నిర్ణయించిన రేటు నుంచి పాట ఉంటుందన్నారు. హెచ్చు పాటదారులు 2025–26 వరకు గడ్డి కోసుకునేందుకు అర్హత కలిగి ఉంటారన్నారు. పాట సొమ్ముతో పాటు, 18 శాతం జీఎస్టీ చెల్లించాలని చెప్పారు.

### తపాలా ఉద్యోగుల రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అడ్డగర్ల


సురేంద్ర

పెద్దాపురం: తంతి, తపాలా శాఖ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెద్దాపురం మండలం కాండ్రకోట బ్రాంచి పోస్ట్‌మాస్టర్ అడ్డగర్ల సురేంద్రనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు నంద్యాలలో జరిగిన రాష్ట్ర గ్రామీణ తపాలా ఉద్యోగుల మహాసభలో ఆయన ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కమిటీకి ఎంపికైన సురేంద్రను పలువురు తపాలా ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

### రేపు విద్యుత్‌కు అంతరాయం

సామర్లకోట: సబ్ స్టేషన్‌లో స్తంభాలు, వైర్ల మార్పు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ సామర్లకోట ఈఈ ఏఈఎన్‌డీఎస్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల కారణంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. స్థానిక పాత్రుళ్లవీధి, చిన్నవీధి, బళ్ల మార్కెట్, గాంధీ చౌక్, కుమ్మరవీధి, తహసీల్దార్ కార్యాలయం, పెద్ద బజార్, ఇస్మాయిల్‌నగర్, పెన్షన్ లైన్, బ్రౌన్‌పేట, గణేష్ కాలనీ, సీతారామకాలనీలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

### నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి శివాలయం సెంటర్‌లోని రైతు క్లబ్‌లో గురువారం సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. రాజమండ్రికి చెందిన గౌతమి నేత్రాలయం వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిది గంటలకు శిబిరం ప్రారంభమవుతుంది.

### మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

బోట్‌క్లబ్: మధ్యవర్తిత్వం ద్వారా కేసులను గౌరవప్రదంగా పరిష్కరించుకోవచ్చని జిల్లా మూడో జడ్జి ఆనంది అన్నారు. మండల న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కార వారోత్సవాలలో భాగంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆమె ప్రారంభించారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి జీజీహెచ్ వరకు ర్యాలీ నిర్వహించారు. చాలా మంది ఏళ్ల తరబడి న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇటువంటి వారు గౌరవప్రదంగా కేసులు పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుందన్నారు. దీనికి సంబంధించి శిక్షణ పొందిన న్యాయవాదులు ఉన్నారని తెలిపారు. కుటుంబ కేసులు, ఆస్తి తగాదాలు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల కేసులు ఈ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి భీరా శ్రీనివాస్, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎన్. విజయబాబు, మూడో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.మోతీలాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు, కమిటీ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# విషాన్ని కలుపుతూ..

- యథేచ్ఛగా కలుపు నివారణ మందుల పిచికారీ
- మాడిపోతున్న పచ్చని చెట్లు, పొలాలు
- రైతుల్లో అవగాహన లోపంతో పంట విషపూరితం
- పట్టించుకోని అధికారులు


గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కలుపు మందు పిచికారీ చేయడంతో మాడిపోయిన పొలం

పిఠాపురం: ఆదిలోనే కలుపును నివారించి కూలి ఖర్చులు తగ్గించుకోవాలని రైతులు పొలాల్లో కొడుతున్న కలుపు మందులు మేలు కంటే రెట్టింపు నష్టాలు కలిగిస్తున్నాయి. పంటలు వేశాక కలుపు తీయించడం కోసం కూలీలు అవసరమవుతుండడంతో, కూలీలు దొరకని పరిస్థితుల్లో రైతులు ఎక్కువగా కలుపు నివారణ మందులకు ప్రాధాన్యమిస్తున్నారు. పంటలు వేయకముందే కలుపు నివారణ మందులు వాడితే మంచిదంటూ కొందరు పురుగు మందుల దుకాణదారులు రైతులను మభ్యపెడుతుండడంతో, ఖాళీగా ఉన్న భూముల్లో ఎక్కువగా కలుపు మందులు పిచికారీ చేస్తున్నారు. రైతుల అవగాహన లోపాన్ని ఆసరాగా చేసుకుని పురుగు మందుల దుకాణదారులు నిషేధిత కలుపు మందులను విక్రయిస్తున్నారు. దీంతో కలుపు నివారణ కంటే భూములు విషపూరితంగా మారే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.

ప్రస్తుతం ఖరీఫ్ సాగు ఆలస్యమవ్వడంతో పలు ప్రాంతాల్లో ఖాళీ భూముల్లో కలుపు నివారణ మందులను రైతులు విచక్షణారహితంగా పిచికారీ చేస్తున్నారు. దీంతో గట్టు చెట్లు, చేమలు సహా భూములన్నీ మాడి మసవుతున్నాయి. ఈ మందుల పిచికారీ వల్ల కలుపు తాత్కాలికంగా మాడిపోతున్నప్పటికీ, పంటలు వేశాక మళ్లీ యథావిధిగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయినప్పటికీ కలుపు నివారణ మందులు మాత్రం విచ్చలవిడిగా వినియోగిస్తూనే ఉన్నారు. అలా చేయడం ప్రమాదమని రైతుల్లో పూర్తి అవగాహన కల్పించాల్సిన అధికారులు మాత్రం చూసీచూడనట్టుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు ఏ మందులు వాడాలి, ఏవి వాడరాదనే విషయాలను కూడా రైతులకు చెప్పే నాథుడే కరవయ్యాడు.

**కూలీల భారం తగ్గించుకోవడానికి..**

పొలాల్లో కలుపు నివారణకు రైతులు సాధారణంగా కూలీలను ఏర్పాటు చేసుకుంటారు. పంట వేసిన 20 రోజుల తర్వాత పొలాల్లో కూలీలతో కలుపు తీయించడం పరిపాటి. ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత ఎక్కువగా ఉండడంతో ముందుగానే కలుపు నివారణకు చర్యలు చేపడుతున్నారు. పంట వేశాక మందు కొడితే నష్టం వాటిల్లుతుందని భావిస్తూ, ముందుగానే మందులు పిచికారీ చేస్తున్నారు. తద్వారా పంటను విషపూరితం చేస్తున్నారు.

**పర్యావరణానికి ముప్పు**

అపాయకర రసాయన కలుపు మందులు పొలాల్లో విచ్చలవిడిగా పిచికారీ చేయడం వల్ల పర్యావరణానికి పెను ముప్పు పొంచి ఉన్నట్టు పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. కలుపు మందు ఎక్కువగా పిచికారీ చేయడం వల్ల భూసారం తగ్గే అవకాశం ఉంది. పంట దిగుబడులపైనా తీవ్ర ప్రభావం చూపుతుంది. పంట నాణ్యత దెబ్బతినడమే కాకుండా, మనిషి ఆరోగ్యానికి హానికరంగా మారుతుంది. కలుపు మందు అవశేషాలున్న పంటలు ఎగుమతులు చేసే అవకాశం కూడా ఉండదు. అమెరికా వంటి అగ్ర దేశాల్లో ఇప్పటికే కలుపు మందులను పూర్తిగా నిషేధించారు. వీటివల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నట్లు పరిశోధనల్లో తేలింది. ఇప్పటికే కొన్ని రకాల కలుపు మందులను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. అయినా అవగాహన లోపంతో రైతులు వీటిని విచ్చలవిడిగా వాడుతున్నారు. ఈ మందులు భూమికే కాదు, పిచికారీ చేసే వ్యక్తులకూ ప్రమాదకరమే. ఈ నేపథ్యంలో ఎటువంటి అవగాహన లేకుండా, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా మందులు పిచికారీ చేస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకుని విచ్చలవిడిగా పిచికారీ చేస్తున్న కలుపు మందులపై దృష్టి సారించకపోతే, పంటకు మార్కెట్‌లో గిరాకీ తగ్గడంతో పాటు, భూములు అక్కరకు రాకుండా, విషపూరితం కావడం ఖాయమని వ్యవసాయ నిపుణులు అంటున్నారు.


మల్లవరంలో కలుపు మందుతో మాడిన పంట

**అధికారుల సూచనలు పాటించాలి**

కలుపు అనేది రైతులకు పెద్ద సమస్యగా మారింది. అందుకే అందరూ కలుపు మందులు వాడుతున్నారు. పంటలు వేసే 15 రోజుల ముందుగానే కలుపు మందు తగిన జాగ్రత్తలు తీసుకుని.. కేవలం గట్లపై మాత్రమే పిచికారీ చేయాలి. అందులోను అధికారులు సూచించిన మందులను మాత్రమే వాడాలి. ఇవి ప్రమాదకరమైన మందులైనందున పురుగు మందుల దుకాణదారులు అనుమతి లేకుండా ఎవరికి పడితే వారికి విక్రయించరాదు. వీటి పిచికారీలో తగిన జాగ్రత్తలు తీసుకోపోతే చాలా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రతి రైతు ఎక్కువగా కలుపు మందుతో పని లేకుండా, ప్రత్యామ్నాయ పద్ధతుల్లో కలుపు నివారణ చర్యలు తీసుకోవడం శ్రేయస్కరం.

– వీవీ సత్యనారాయణ, వ్యవసాయశాఖాధికారి, గొల్లప్రోలు

### సబ్సిడీపై డ్రోన్ పరికరాలు


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

సామర్లకోట: ఎరువులను సులభతరంగా ఉపయోగించే డ్రోన్ పరికరాలను రైతులకు సబ్సిడీపై అందిస్తామని వ్యవసాయ శాఖ ఏడీ దుర్గాలక్ష్మి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పి.వేమవరంలో రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు వృథా కాకుండా, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చేలా పిండితో పాటు, లిక్విడ్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. లిక్విడ్ ఎరువులను స్ప్రేయర్లతో పాటు, డ్రోన్ ద్వారా పిచికారీ చేస్తే పొలమంతా అందుతుందని చెప్పారు. డ్రోన్ పనితీరును రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ఎరువులు అందిస్తామన్నారు. గ్రామంలో రైతులు వేసిన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ వి.మురళీధర్, నీటి సంఘ అధ్యక్షుడు రాంబాబు, వ్యవసాయాధికారులు శాంతి, కమల, రూప పాల్గొన్నారు.

### 20న వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం

సామర్లకోట: వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 20వ తేదీన ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు తలారి దొరబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, వీకే రాయపురంలో నిర్వహించే ఈ సమావేశంలో నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. గ్రామ, మండల స్థాయి పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, పార్టీ కార్యకర్తలు హాజరు కావాలన్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యలపై ఈ సమావేశంలో చర్చిస్తారని చెప్పారు.

## బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకట్రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పిఠాపురం: బాలల స్నేహ పూరిత కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ, స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సీహెచ్ దుర్గాదేవి ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ, వార్డు స్థాయి బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీ అధికారులకు బాలల పరిరక్షణ చట్టాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, బాల్య వివాహాలు జరగకుండా చూడవలసిన బాధ్యత గ్రామ స్థాయి కమిటీ అధికారులందరికీ ఉందన్నారు. ఎంపీడీఓ స్వప్న మాట్లాడుతూ, సామాజిక రుగ్మతగా బాల్య వివాహాలపై విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలతో పాటు, ప్రభుత్వం నుంచి పొందే అన్ని పథకాలు రద్దు చేస్తామన్నారు. ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారం గ్రామ స్థాయిలో సమావేశాలను సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటు చేయాలన్నారు. వార్డు అడ్మిన్ సెక్రటరీలు 18 ఏళ్లు నిండని వారికి ఎటువంటి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇవ్వరాదని సూచించారు. ఇస్తే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, ఉద్యోగం నుంచి తొలగిస్తామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారులు కె.శ్రీనివాస్, జాగరపు విజయ, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సెలర్ బి.దుర్గారాణి, సర్పంచ్‌లు నల్ల రాంబాబు, నడగట్ల చింతలరావు, పడాల ఏడుకొండలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.రాజేశ్వరి, కేఎస్ అరుణశ్రీ, బి.ప్రభావతి డి.సుజాత, వీఆర్‌ఓలు, ఏఎన్‌ఎమ్‌లు, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, వీవోఏలు పాల్గొన్నారు.

## 22న ఏఐఎఫ్‌టీయూ మహాసభ


గొల్లప్రోలులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పిఠాపురం: అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహాసభ పిఠాపురంలో ఈ నెల 22న జరుగుతుందని సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు తెలిపారు. ఈ మేరకు సంఘ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గొల్లప్రోలు నగర పంచాయతీలో బుధవారం ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణ, నిరుద్యోగం, కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిన నేపథ్యంలో.. కార్మిక హక్కులను కాపాడుకునేలా, కార్మికులను చైతన్యం తెచ్చేందుకు ఈ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. పాత బస్టాండ్ వద్ద సూర్యరాయ, విద్యానంద గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక బస్టాండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం, కోటగుమ్మం సెంటర్, ఉప్పాడ సెంటర్ మీదుగా సూర్యరాయ గ్రంథాలయం వరకు అరుణోదయ కళాకారుల కళారూపాలతో భారీ కార్మికుల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ సభలో గత ఉద్యమాలను సమీక్షించుకుని, భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తారన్నారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ రాష్ట్రాల చైర్‌పర్సన్ విమలక్క, ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీం బాషా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కుడితి సతీష్, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) కన్వీనర్ డొక్కులూరి సంగీత, నాయకులు రెడ్డి దుర్గాదేవి, చింతపల్లి రత్నం, ఏఐఎఫ్‌టీయూ నాయకులు మడికి సత్యం, డి.నారాయణమూర్తి, బల్ల సోమరాజు, కేశవరపు వీరన్న, కానూరు నానిబాబు, వేగిశెట్టి గణేష్, గొర్ల శివ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు
- ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుల శిక్షణ ముగింపు


శిక్షణ పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

సామర్లకోట: మూడు రోజుల పాటు ఆటపాటలతో నేర్చుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎన్‌వీ ప్రసాదరావు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఉమ్మడి జిల్లాలోని మహిళా ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, మార్పు ద్వారా విజేతల పేరిట పరిపాలన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవడానికి శిక్షణ ఉపకరిస్తుందన్నారు. మహిళలు పాలకులైతే సమగ్రాభివృద్ధి సాధ్యమని నిరూపించుకోవడానికి వేదికగా ఉంటుందన్నారు. ఇప్పటివరకు పరిపాలన ద్వారా తెలుసుకున్న విషయాలకు ఈ శిక్షణ దోహదపడుతుంద న్నారు. ప్రజాప్రతినిధులుగా మహిళలు మరింత ఉన్నత పదవులు పొందడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఫ్యాకల్టీ కేఆర్ నిహారిక శిక్షణ ఆసక్తికరంగా సాగిందని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు అభినందించారు. ముగింపు రోజు శిక్షణలో సభ నిర్వాహణకు వైకుంఠపాళి ఆటతో శిక్షణ ఆకట్టుకుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, డీడీఓ శ్రీనివాసరావు, కోర్సు డైరెక్టర్ కె.సుశీల, శర్మ, చక్రపాణిరావు పాల్గొన్నారు.

### సీపీఐ జిల్లా కార్యదర్శిగా బోడకొండ



సామర్లకోట: సీపీఐ జిల్లా కార్యదర్శిగా కె.బోడకొండను ఎంపిక చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ తెలిపారు. స్థానిక రైతు భవనంలో బుధవారం ఉదయం నుంచి జిల్లా స్థాయి సీపీఐ మహాసభ జరిగింది. సాయంత్రం జిల్లా కమిటీని ఎంపిక చేశారు. జిల్లా సహాయ కార్యదర్శులుగా తోకల ప్రసాద్, పి.సత్యనారాయణ, ఎ.భవాని, బొబ్బిలి శ్రీనివాసు, శాఖ రామకృష్ణ, పప్పు ఆదినారాయణలు ఎంపికయ్యారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక తీర్మానాలను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు ప్రవేశపెట్టారు.



నిర్మానుష్యంగా ఉన్న హుస్సేన్‌పురం కెనాల్ రోడ్డు

సామర్లకోట: వర్షాకాలంలోను భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండడంతో వృద్ధులు, చిన్నారులు అల్లాడుతున్నారు. నాలుగు రోజులుగా ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ ఎండవేడి తగ్గకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. వేసవిలో కూడా ఇంతటి వేడి వాతావరణం లేదని, గాలిలో చల్లదనం కూడా లేకపోవడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు.

## యోగాంధ్ర రాష్ట్రస్థాయి విజేతలకు అభినందన


రాష్ట్ర యోగా విజేతలను అభినందిస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

కాకినాడ సిటీ: ఇటీవల విజయవాడలో నిర్వహించిన యోగాంధ్ర రాష్ట్ర స్థాయి ఉత్సవాల్లో జిల్లా విజేతలు, విశాఖలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి యోగాభ్యాసంలో పాల్గొన్న జిల్లాకు చెందిన విజేతలను బుధవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రి పి.నారాయణ, కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఎస్ నాయకర్ జూనియర్ కళాశాల అధ్యాపకులు యోగాచార్య చిట్టూరి చిట్టిబాబుతో కూడిన బృందాన్ని వీరు ప్రత్యేకంగా అభినందించారు. మంత్రి నారాయణ చేతుల మీదుగా కలెక్టర్ షణ్మోహన్‌కు రాష్ట్ర యోగ పోటీ విజేతల అభినందన జ్ఞాపికను అందజేశారు. రాష్ట్ర యోగా పోటీల విజేతలు డి దుర్గాశాంతప్రసాద్ (ఫొటోగ్రఫీ), సయ్యద్ యాసిన్ మొహిద్దీన్ (వ్యాసరచన), ఎం.సత్తిబాబు (పోస్టర్ ప్రెజెంటేషన్), కె.ఆదిత్య (యోగా సాంగ్స్), కేబీవీ శివసాయిరామ్, జి.లహరి దుర్గ, ఆర్.చైత్ర శివవాసుకి, జి.దివ్యాంజలి, బి.లక్ష్మి (సోలో యోగా, మిక్స్ యోగా, సింక్రోనైజ్ యోగా అంశాలు) తదితరులు వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న 12 మంది రాష్ట్ర విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అధికారులు పాల్గొన్నారు.

### నాటారు.. రక్షణ కల్పించారు


చెరువు గట్టుపై నాటిన మొక్కలకు రక్షణ ఏర్పాట్లు

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: పట్టణంలోని నీలమ్మ చెరువు గట్టుపై అసంపూర్తిగా వదిలేసిన మొక్కలను మున్సిపల్ అధికారులు నాటి, వాటికి రక్షణ కల్పించారు. ‘మొక్క’బడిగా.. శీర్షికన సోమవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్య ప్రదేశాల్లో మొక్కలు నాటడానికి ఫారెస్టు కార్యాలయం నుంచి మొక్కలు వచ్చాయి. మొక్కలను నీలమ్మ చెరువు గట్టుపై తీసిన గోతుల్లో అసంపూర్తిగా వదలేశారు. ఈ విషయమై ‘సాక్షి’లో కథనం ప్రచురితం కావడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. లోతుగా గోతులు తీసి మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. ఈ మొక్కలను పశువుల నుంచి రక్షణ కల్పించే విధంగా చుట్టూ రక్షణ ఏర్పాట్లు చేశారు.


### ఉద్యమంలా మొక్కలను పెంచాలి

కాకినాడ రూరల్: వృక్ష సంపదపైనే భవిష్యత్తులో మానవాళి మనుగడ ఆధారపడి ఉన్నందున ఒక ఉద్యమంగా మొక్కలు నాటి పెంచాలని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ కాకినాడ అధ్యక్షురాలు భానుమతి అన్నారు. స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ కాకినాడ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా భానుమతి మాట్లాడుతూ, భావితరాలకు ఆక్సిజన్ కొనే పరిస్థితి రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మొక్క నాటాలని అన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ పుట్టిన రోజున ఒక మొక్క నాటడాన్ని అలవరచుకోవాలని భానుమతి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డి.లక్ష్మి, మల్లీశ్వరి, అనిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల నిరోధంపై కళాజాత

కాకినాడ సిటీ: స్థానిక ఐటీఐ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాలను నిరోధించాలని ప్రదర్శన నిర్వహించారు. వయోవృద్ధుల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహాయ, సహకారాలు, పింఛన్లు, తల్లిదండ్రులను కన్నబిడ్డలు పట్టించుకోక పోతే ట్రిబ్యునల్ ద్వారా ప్రతి నెల భరణంగా రూ.10 వేలు అందించేలా తీసుకువచ్చిన చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


శేషుకుమారికి దుర్గాబాయి దేశ్‌ముఖ్ పురస్కారం అందిస్తున్న ఏఐడబ్ల్యూసీ సభ్యులు

బోట్‌క్లబ్: మహిళలు దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోన్ అధ్యక్షురాలు మాకినీడి శేషుకుమారి అన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ 144వ జయంతిని బుధవారం ఆలిండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ (ఏఐడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న మాకినీడి శేషుకుమారికి దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డును ఏఐడబ్ల్యూసీ సభ్యులు అందించి, సత్కరించారు. భారత స్వాతంత్య్రం కోసం దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఎంతో పోరాడారన్నారు. న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా ఆమె అందించిన సేవలు మరువలేనివన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఆమె ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తొలుత దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఏఐడబ్ల్యూసీ సభ్యులు భానుశేషు, చక్క సుశీ, వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షురాలు ఎన్.సుజాత పాల్గొన్నారు.

## ఐవీఆర్‌ఎస్ కాల్స్‌కు సమాధానం ఇవ్వాలి

- డీఎల్‌డీఓ వాసుదేవరావు


గురజనాపల్లిలో ఐవీఆర్‌ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీఓ వాసుదేవరావు

కరప: వివిధ అంశాలపై గ్రామ పంచాయతీల పనితీరుపై ఐవీఆర్‌ఎస్ కాల్స్ అర్థం చేసుకుని సరైన సమాధానం ఇవ్వాలని డీఎల్‌డీఓ పి.వాసుదేవరావు అన్నారు. అడిగిన ప్రశ్న ఒకటైతే.. వేరేలా అర్థం చేసుకుని సొంత సమస్యగా భావించి సమాధానం ఇచ్చేటప్పుడు ఒక నంబరు నొక్కబోయి, మరో నంబర్ నొక్కితే ఆ పంచాయతీ పనితీరుపై తప్పుడు సమాచారం వెళ్తుందని, దానివల్ల పంచాయతీకి వచ్చే నిధులు వెనుకబడిపోతాయన్నారు. మండల పర్యటనలో భాగంగా బుధవారం ఆయన గురజనాపల్లిలో పర్యటించి పారిశుధ్య పనులు, తాగునీటి క్లోరినేషన్ పరిశీలించారు. చేయాల్సిన విధి, విధానాలపై సూచనలిచ్చారు. ఆయన ప్రజలను కలసి పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను విడదీసి ఇవ్వాలన్నారు. ఏమైనా సమస్యలున్నాయా అని ఆయన ప్రశ్నించగా, డ్రెయిన్లు లేక ఇళ్లల్లో వాడకంనీరు, వర్షపు నీరు వెళ్లే మార్గం లేక, నీరు నిలబడిపోయి ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎక్కడెక్కడ డ్రెయిన్లు కావాలో ప్రతిపాదనలు పంపించాలని, నిధులను బట్టి మంజూరు చేయిద్దామని పంచాయతీ అధికారులను ఆయన ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి, దాని నిర్వహణపై సూచనలిచ్చారు. వాటర్ ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్ డీఎల్‌డీఓ వాసుదేవరావు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**నడకుదురులో..**

నడకుదురు గ్రామంలో బుధవారం డీఎల్‌పీఓ టి.అన్నామణి పర్యటించి, పారిశుధ్య పనుల నిర్వహణ, తాగునీటి క్లోరినేషన్, తడి, పొడి చెత్త సేకరణ, ఐవీఆర్‌ఎస్ కాల్స్‌పై ప్రజలకు వివరించి, అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి వారిజ, ఇతర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.